క్లుప్తంగా

18న మహాశివరాత్రి వేడుక

ప్రొద్దుటూరు కల్చరల్ : అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ శంకర్ బాలాజీ తెలిపారు. శనివారం తెల్లవారుజామున స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్ర హోమం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహిస్తామని ఆయన వివరించారు. ఉదయం 10 గంటలకు శివపార్వతుల కల్యాణం, రాత్రి 7 గంటలకు స్వామివారి గ్రామోత్సవం, 10 గంటలకు లింగోద్భవ కాలంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన ఉంటుందని వివరించారు.

ఘనంగా గోరి స్వామి ఉరుసు



సమాధిని దర్శించుకుంటున్న భక్తులు

దువ్వూరు : మండల పరిధిలోని పాత దువ్వూరు గ్రామంలో మంగళవారం శ్రీగోరి స్వామి ఉరుసు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉరుసు సందర్భంగా స్వామివారి సమాధిని పూల దుప్పట్లతో అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి సమాధిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన నిర్వహించారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ



పండ్లు, బ్రెడ్ అందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం తులసి సేవా సంఘం ఆధ్వర్యంలో 40 మంది రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. సంఘం ఉపాధ్యక్షురాలు డి.అనూరాధ పుట్టిన రోజు సందర్భంగా ఆస్పత్రిలోని టీబీ వార్డులోని రోగులకు, బాలింతలకు బ్రెడ్లు, పండ్లు అందించారు. సంఘం అధ్యక్షురాలు మల్లెపూల తులసి, ప్రధాన కార్యదర్శి బి.వినిత, నాగవేణి తెలిపారు.

తైక్వాండో పోటీల్లో పతకాలు



పతకాలతో విద్యార్థులు

పోరుమామిళ్ల : కాకినాడ ఇండోర్ స్టేడియంలో ఈనెల 12న జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్స్ తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్ల క్రీడాకారులు పతకాలు సాధించారని మాస్టర్ నాయబ్ రసూల్ మంగళవారం తెలిపారు. సంగా భవ్య రజత పతకం, బద్రీనాథ్, మహబూబ్‌బాషాలు కాంస్య పతకాలు సాధించారన్నారు. క్రీడాకారులను మంగళవారం జిల్లా తైక్వాండో అధ్యక్షుడు శంకర్‌రెడ్డి అభినందించారన్నారు.

అమరవీరులకు నివాళులు




మాజీ సైనికులను సత్కరిస్తున్న నిర్వాహకులు

మైదుకూరు : పుల్వామా అమరవీరులకు మంగళవారం మైదుకూరులో ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక వేదవ్యాస పాఠశాలలో అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ డి.రాముడు తదితరులు అమర వీరుల చిత్ర పటాల వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు రామసుబ్బారెడ్డి, కర్రె పుల్లయ్యలను సత్కరించారు. వాగ్దాదం శివశంకర్, ప్రసన్నకుమార్, సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'జీతాలు చెల్లించండి'

పోరుమామిళ్ల : స్వచ్ఛ భారత్ కార్మికులను ఏర్పాటు చేసిన మోడీ ప్రభుత్వం గత పది నెలలుగా వారికి జీతాలివ్వకుండా నిమ్మకు నీరెత్తినట్లుందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మస్తాన్ విమర్శించారు. మంగళవారం స్వచ్ఛ భారత్ కార్మికులతో కలసి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈఓపీఆర్‌డీ భాస్కర్‌బాబుకు వినతిపత్రం ఇచ్చారు. సీపీఐ రవి, కార్మికులు రామయ్య, శ్రీరాములు, యోహాన్, దానం, ఓబయ్య, వెంకటేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : మైదుకూరు రోడ్డులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న భారత్ ఎనామిల్ ఇండస్ట్రీలో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదంలో సుమారు రూ. 9 లక్షలు విలువైన పలకలు కాలిపోయినట్లు ఫ్యాక్టరీ యజమాని పి.శివారెడ్డి తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని అధికారులు పేర్కొన్నారు.

యోగా, శారీరక శ్రమతో ఆరోగ్యం



ప్రొద్దుటూరు క్రైం: ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు



చాపాడు: సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న అధికారులు



పోరుమామిళ్ల: సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం: యోగా, శారీరక శ్రమతో ఆరోగ్యం చేకూరుతుందని డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కల్లూరు పీహెచ్‌సీ, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో మంగళవారం ఆయుష్మాన్ భారత్– ఆరోగ్య మేళా వారోత్సవాల్లో భాగంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక శ్రమతో పాటు యోగా, మెడిటేషన్ ప్రతి రోజు చేయాలన్నారు. దీని వల్ల మనసు ప్రశాంతంగా ఉండటంతో పాటు బీపీ, షుగర్, ఒత్తిడి నియంత్రణలో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు మహాలక్ష్మి, మునిరాంప్రసాద్, విలేజ్ హెల్త్ సెంటర్ సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కామనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

కామనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గోపవరంలోని రెండవ సచివాలయ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉపేంద్ర, కామనూరు పీహెచ్‌సీ డాక్టర్ హనీఫ్‌బాబా మాట్లాడుతూ సైకిల్ తొక్కడం, వ్యాయామం, యోగా ఆరోగ్యానికి మంచిదదన్నారు. డాక్టర్ శ్రీనివాసులు, సీహెచ్‌ఓ కృష్ణమ్మ, హెచ్ఈ శోభారాణి, సూపర్‌వైజర్ వరప్రసాద్, చంద్రకళ, సీహెచ్‌ఓలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : రోజూ సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యం చేకూరుతుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ తెలిపారు. మంగళవారం ఆయుష్మాన్ భారత్ –ఆరోగ్య మేళా వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా స్థానిక అనిబిసెంట్ హైస్కూల్ నుంచి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైక్లింగ్ చేయడం వల్ల రక్తపోటును నియంత్రించవచ్చని, శారీరక బరువు, ఒత్తిడి తగ్గుతుందన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉచిత ల్యాబ్ పరీక్షలు, టెలిమెడిసిన్ సేవలు, మాతా శిశు సంరక్షణ సేవలు, మధుమేహం, రక్తపోటు తదితర సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కింద ప్రతి నెల 14వ తేదీ ఆరోగ్య మేళలో అన్ని అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య సేవలు అందిస్తున్నామన్నారు. వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు గురప్ప, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

■ మండలంలోని తాళ్లమాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆయుష్మాన్ భారత్ – ఆరోగ్య మేళా వారోత్సవాల సందర్భంగా విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు గోపినాథ్ రెడ్డి, పీఈటీ ఓబయ్య, పాల్గొన్నారు.

వ్యాయామం తప్పనిసరి

రాజుపాళెం : ప్రతి రోజు వ్యాయామం చేస్తే ఆరోగ్యకరంగా ఉంటారని రాజుపాళెం పీహెచ్‌సీ వైద్యురాలు మంజుల పేర్కొన్నారు. ఆరోగ్యానికి భరోసా – ప్రగతికి హామీ ఆయుష్మార్ భారత్ – ఆరోగ్య మేళా వారోత్సవాల్లో భాగంగా రాజుపాళెంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యురాలు మాట్లాడుతూ వ్యాయామం, సైక్లింగ్, యోగా చేయడం వల్ల ఒత్తిడి తగ్గి మనసుకు ప్రశాంతత చేకూరుతుందని తెలిపారు. హెచ్‌ఎం వేలంగి కుమార్, వైద్యురాలు నిఖిత, సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శివ, పీహెచ్‌ఎన్, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

బద్వేలు అర్బన్ : క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్– ఆరోగ్యమేళా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి నెల్లూరు రోడ్డు వరకు పాఠశాల విద్యార్థులతో, వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ జ్యోత్స్న, స్వర్ణలత, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ రాజేష్, డాక్టర్ సౌమ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి.సుబ్బారెడ్డి, అర్బన్ ఎస్ఐ శ్రీకాంత్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంటయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు జనార్దన్, శ్రీరాములయ్య, ఖాశీం, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

శారీరక శ్రమలేక అనారోగ్యాలు

పోరుమామిళ్ల : శారీరక శ్రమ లేకపోవడం, ఆహార నియమాలు పాటించకపోవడం వల్ల అనేక వ్యాధులు తెచ్చుకుంటున్నారని డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పోరుమామిళ్లలోని వెంకటేశ్వర ఉన్నత పాఠశాల, లిటిల్ ఏంజిల్ పాఠశాలల్లో వైద్య సిబ్బంది వేరువేరుగా ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాలు నిర్వహించారు. ఆరోగ్యమేళా వారోత్సవాల్లో భాగంగా ఆయా పాఠశాలల విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం వాకింగ్, వ్యాయామం, యోగా చేయడం వలన రక్తపోటు, షుగర్, ఊబకాయం తదితర రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారి సాధు వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిర్మల, పబ్లిక్ హెల్త్ నర్స్ సుకన్య, భార్గవి, లక్ష్మి పాల్గొన్నారు. లిటిల్ ఏంజిల్ పాఠశాలలో వైద్యసిబ్బంది చామంతి, సుప్రియ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బి.కోడూరులో..

బి.కోడూరు : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బి.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వైద్యాధికారులు డాక్టర్ ఎస్.వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఎ.ఉదయకిరణ్‌ల ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ – ఆరోగ్యమేళా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోజుకు కనసీం పది కిలోమీటర్లు సైకిల్ తొక్కడం చాలా ఆరోగ్యకరమని తెలిపారు. అలాగే బి.కోడూరు, గోవిందాయపల్లె, ఆదిత్యారాంపేట పాఠశాలల్లో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నరసింహారెడ్డి, సీహెచ్‌ఓ నాగమణి, పీహెచ్‌ఎన్ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజర్ జాన్ విలియం, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శేఖర్‌రెడ్డి, పుల్లయ్య, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడిని జయించవచ్చు

కాశినాయన : యోగాతో ఒత్తిడిని జయించవచ్చని సీహెచ్‌ఓ భవ్య అన్నారు. మంగళవారం మండలంలోని రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ ఆధ్వర్యంలో ఆరోగ్యమేళా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సైకిల్ తొక్కడం, యోగా, ధ్యానం, వ్యాయామం తదితర అంశాలపై విద్యార్థులకు ఆమె అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో యోగా, ధ్యానం, వ్యాయామం చేయించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం మెహరున్నీసా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి ఉపయోగకరం

చాపాడు : అన్ని వయస్సుల వారు ప్రతి రోజూ క్రమం తప్పకుండా సైకిల్ తొక్కడం వలన ఆరోగ్యానికి ఉపయోగపకరమని మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్– ఆరోగ్య మేళా వారోత్సవాలలో భాగంగా మంగళవారం మండల కేంద్రమైన చాపాడులో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించిన సైకిల్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా తహసీల్దారు సుభానీ, ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు హాజరయ్యారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో అవగాహన సమావేశం నిర్వహించి మంచి ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. ఇదే క్రమంలో ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే వైద్య సేవల గురించి వివరించారు. మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో వైద్య ఆయుష్మాన్ భారత్–ఆరోగ్య మేళా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాముడు, సూపర్‌వైజర్ సరస్వతి, ఏఎన్‌ఎంలు రిబకమ్మ, స్రవంతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ సైకిల్ ర్యాలీ

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సురేష్‌బాబు, సమీరల ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ – ఆరోగ్య మేళా వారోత్సవాల సందర్భంగా మంగళవారం విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా చేయడం వలన ఆరోగ్యం చేకూరుతుదంని తెలిపారు.

బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం ఇవ్వాలి



తహసీల్దారుతో మాట్లాడుతున్న బాధిత రైతులు

చాపాడు: బెంగళూరు–విజయవాడ మధ్య నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలో కోల్పోయే భూములకు బహిరంగ మార్కెట్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని బాధిత రైతులు పేర్కొన్నారు. ఎక్స్‌ప్రెస్ గ్రీన్ ఫీల్డులో భూములు పోయే మండలంలోని అల్లాడుపల్లె, కేతవరం, లక్ష్మీపేట, బద్రిపల్లె, అనంతపురం రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం తహసీల్దారు సుభానీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. హైవే రహదారికి భూములు ఇవ్వడం వలన జీవనాధారమైన భూములు కోల్పోతామన్నారు. దీనికి పరిహారంగా ప్రభుత్వం ఇస్తున్న నష్ట పరిహారం విలువ బహిరంగ మార్కెట్ కన్నా తక్కువగా ఉందన్నారు. అల్లాడుపల్లె పొలంలో హైవే పక్కన బహిరం మార్కెట్‌లో ఎకరా రూ.2 కోట్లు పలుకుతుందని, కాస్త లోపల ఉన్న భూములు ఎకరా రూ.50 లక్షలు ఉందన్నారు. ప్రభుత్వం ఇస్తామంటున్న రూ.10 లక్షల పరిహారం ఏ మాత్రం రైతుకు ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రభుత్వం రైతులకు న్యాయం చేయకపోతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. రైతుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలుగా మారతాయన్నారు. ఉన్నతాధికారులు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బాధిత రైతులు చంద్రశేఖర్ రెడ్డి, చెన్నయ్య, గురుశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, దస్తగిరమ్మ తదితర రైతులు పాల్గొని తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు.

జగనన్నకు అండగా నిలుద్దాం



కిట్లు పంపిణీ చేస్తున్న యద్దారెడ్డి

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరిస్తూ రాబోవు ఎన్నికల్లో మళ్ళీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు చురుకైన పాత్ర పోషించాలని వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ ఈగ యద్దారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయనగర్‌లో శివానగర్, ఎస్.కె.డి.నగర్ సచివాలయాల పరిధిలోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లకు మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సారధులు, కన్వీనర్లు నిత్యం ప్రజల్లో ఉంటూ గత ప్రభుత్వ హయాంలో అందిన పథకాలు, ప్రస్తుత ప్రభుత్వంలో అందుతున్న పథకాల మధ్య తేడాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు వెంకటకృష్ణ, దుద్దుకూరు సత్యం, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు తోట నాగేశ్వర్‌రావు, సరిటాల మౌలాలి, షఫి, బుజ్జి, శ్రీకాంత్‌రెడ్డి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఆర్డీఓ



హెడ్‌మాస్టర్‌తో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరమణ

మైదుకూరు : పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూత్‌లను మంగళవారం బద్వేలు ఆర్డీఓ ఆకుల వెంకటరమణ పరిశీలించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ (బాలుర) లోని తరగతి గదుల్లో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయనున్నారు. పాఠశాలలోని పదో తరగతి క్లాస్ రూములను పరిశీలించిన ఆర్డీఓ హైస్కూల్ హెడ్మాస్టర్ రమాదేవిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ కుళ్లాయమ్మ, మున్సిపల్ కమిషనర్ రాముడు, ఆర్ఐ రోహిత్ ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

పోలింగ్ బూత్‌లను పరిశీలించే క్రమంలో హైస్కూల్ భవనాల పరిసరాలను గమనించిన ఆర్డీఓ వెంకటరమణ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని హెడ్మాస్టర్ రమాదేవికి సూచించారు. దక్షిణం వైపు ఉన్న తరగతి గదుల వద్ద పిచ్చి మొక్కలు పెరిగి, చెత్తా చెదారం ఉండటంతో వాటిని తొలగించాలని ఆర్డీఓ తెలిపారు. పడమర వైపు అదనపు తరగతి గదుల గురించి ఆర్డీఓ ఆరా తీశారు. అక్కడ షెడ్ లాంటిది వేసి పిల్లలకు డైనింగ్ హాల్‌గా వినియోగించుకోవాలని సూచించారు.

పక్కా గృహాలను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ, అధికారులు

బద్వేలు : లబ్ధిదారులు ప్రభుత్వం కేటాయించిన పక్కా గృహాల నిర్మాణాలను పూర్తి చేయాలని పోరుమామిళ్ల హౌసింగ్ ఏఈ రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన వెలుగు ఏపీఎం అశోక్‌రెడ్డితో కలిసి పోరుమామిళ్ల మండలం తిమ్మారెడ్డిపల్లె సచివాలయంలో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. టేకూరుపేట లేఅవుట్‌లో నెలల తరబడి నిర్మాణాలను ఆపేసిన లబ్ధిదారులను వెంటనే పూర్తి చేసేలా చూడాలని కోరారు. ప్రభుత్వం నుంచి సహకారం అందించడంతోపాటు అవసరమైతే డ్వాక్రా సభ్యులైతే వారి సంఘాల నుంచి రుణాలు ఇప్పిస్తామన్నారు. ఆ నగదుతో నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కార్తిక్, వెంకటరమణ, వెల్ఫేర్ అసిస్టెంట్ రఘురామిరెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ గురప్ప, మహిళా పోలీస్ మాబుచాను తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు కృతజ్ఞతలు

ప్రొద్దుటూరు : కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ఖాదర్‌బాద్‌కు చెందిన దివ్యాంగుడు షేక్ మస్తాన్ వలంటీర్లు సురేంద్ర, గోపిలకు కృతజ్ఞతలు తెలిపారు. గతేడాది ఆగస్టు నెలలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో మస్తాన్ రెండు కాళ్లు పోయి దివ్యాంగుడిగా మారాడు. వలంటీర్లు ఇతనిని సచివాలయానికి తీసుకెళ్లి సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయించారు. మంగళవారం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వలంటీర్లు మస్తాన్‌కు డాక్టర్లచే పరీక్షలు చేయించి సదరం సర్టిఫికెట్ మంజూరు చేయించారు. వలంటీర్లకు మస్తాన్ ధన్యవాదాలు తెలిపారు.

రైతులందరూ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వండి

చాపాడు : గ్రీన్ ఫీల్డు ఎక్స్‌ప్రెస్ హైవే లో భూములు కోల్పోయే బాధిత రైతులందరూ తమ భూముల 1–బీ, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పత్రాలను అందజేయాలని తహసీల్దారు సుభానీ పేర్కొన్నారు. మండలంలోని సోమాపురం గ్రామ సచివాలయంలో మంగళవారం సాయంత్రం తహసీల్దారు రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూముల కోల్పోయే రైతులకు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందుతుందన్నారు. ఎలాంటి అభ్యంతరాలున్నా వినతులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. స్థానిక శ్రీచైతన్య, ఆదిత్య, అరవింద్, గౌతమ్ ప్రైవేటు పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యల గురించి చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ కూరపాటి శ్రీనివాసులరెడ్డి, విశ్రాంత వ్యాయమ ఉపాధ్యాయులు కోటా ఓబుళరెడ్డి, రామసుధాకర్‌రెడ్డి, షేక్షావలి, కేసీ ఓబుళరెడ్డి, మురళి పాల్గొన్నారు.

22న వక్తృత్వ పోటీలు

కడప కల్చరల్ : స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఈనెల 22వ తేదిన నగరంలోని విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నట్లు రాయలసీమ టూరిజం అండ్‌కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు తెలిపారు. స్థానిక రాజీవ్‌మార్గ్‌లోని రెడ్డిసేవా సమితి కార్యాలయంలో ఈనెల 22న పోటీ ప్రారంభిస్తామని తెలిపారు. విద్యార్థులు స్వాతంత్ర్య సమరంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పాత్ర అనే అంశంపై పోటీలో మాట్లాడవలసి ఉంటుందన్నారు. వివరాలకు 98491 97044లో సంప్రదించాలని సూచించారు.

మార్చి ఆఖరు వరకు కేసీకి నీరు

మండల సర్వసభ్య సమావేశంలో ఏఈ జాన్సన్



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : ఈ ఏడాది మార్చి ఆఖరు లేదా ఏప్రిల్ మొదటి వారం వరకు కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేస్తామని కేసీ కెనాల్ ప్రొద్దుటూరు సెక్షన్ ఏఈ జి.జాన్సన్ తెలిపారు. మండల ఉపాధ్యక్షురాలు ఇంజేటి రెడ్డమ్మ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ మండల పరిధిలో కేసీ కెనాల్ కింద 4,170 ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. ఆయకట్టు పరిధిలో వరి పంటకు నీరు విడుదల చేశామన్నారు. డిస్కం రూరల్ ఏఈ నరసింహారెడ్డి మాట్లాడుతూ రైతులకు 9 గంటలు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని తెలిపారు. వేకువజామున 4 గంటలకు కాకుండా 6 గంటల నుంచి విద్యుత్ సరఫరా చేయాలని సభ్యులు కోరారు. బొల్లవరం, రామేశ్వరం, మీనాపురం లే అవుట్లతోపాటు జగనన్న ఇళ్లు నిర్మించుకునే వారికి ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు ఇస్తామని ఏఈ తెలిపారు. వినియోగదారులు ఎవరికీ డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. మండలంలో 2045 స్వయం సహాయక సంఘాలున్నాయని, 73 గ్రామ సమాఖ్యలు పనిచేస్తున్నాయని ఏపీఎం వెంకటసుబ్బమ్మ తెలిపారు. వీటిలో 1167 సంఘాలకు రూ.93లక్షలు ఉన్నతి ద్వారా రుణాలు మంజూరు చేశామన్నారు. బ్యాంకుల లింకేజి ద్వారా రూ.93 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. ప్రతి సభ్యురాలు జగనన్న కాలనీలో నిర్మించే ఇంటికి రూ.35వేలు చొప్పున చెల్లిస్తే ప్రభుత్వం రూ.1.80 లక్షలు చెల్లిస్తుందన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.ఉపేంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులందరూ మండల సర్వసభ్య సమావేశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను సమస్యల ద్వారానే పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఎక్కువ మంది సర్పంచ్‌లతోపాటు రెవెన్యూ అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. సమావేశంలో జెడ్పీటీ వైస్ చైర్మన్ జేష్టాది శారద, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రొద్దుటూరు : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు మంగళవారం ఏపీటీఎఫ్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్లకు వినతి పత్రాలను సమర్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 12వ పీఆర్సీని నియమించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను ప్రకటించాని తెలిపారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయించాలన్నారు. 3, 4, 5 తరగతుల విలీనాన్ని నిలిపేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి, ప్రొద్దుటూరు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు కుళ్లాయిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు సుబ్బయ్య, అమీన్, అఫ్సర్‌బాషా, ఖాజాపీర్, దస్తగిరి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

22వ వార్డులో కల్వర్టు నిర్మిస్తాం



జోక్‌పాలెంలో దెబ్బతిన్న రోడ్డు కల్వర్టును పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు పరిధిలో దెబ్బతిన్న కల్వర్టును నిర్మించడంతోపాటు రోడ్డు మరమ్మతులు చేయిస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. స్థానిక ప్రజల కోరిక మేరకు వార్డు ఇన్‌చార్జి హిదాయత్ సమస్యను మున్సిపల్ వైస్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ మంగళవారం జోక్‌పాలెంలో పర్యటించి సమస్యను గుర్తించారు. త్వరగా కల్వర్టు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆయన కోరారు. కౌన్సిలర్ వడ్ల ఖలీలుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్ల దాదాపీర్, కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

లీగల్ ప్రకటన

ఇందుములంగా యావన్మంది ప్రజలకు తెలియచేయడం ఏమనగా : మా క్లయింట్ ముత్యర రాజేశ్వరి W/o కొండారెడ్డి మరియు వీరి వారసులు తరఫున రాజశ్రీ మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు O.S.No.15/2023, IA.No.211/2023 ప్రకారం సివిల్ వాజ్యం దాఖలు చేయడం జరిగింది. ఇట్టి సివిల్ వాజ్యం నందు దువ్వూరు గ్రామ పొలంలో సర్వే నెంబర్ 129/B2A విస్తీర్ణం 2.45 సెంట్లు ఆస్తి భాగపరిష్కారం పెండింగ్‌లో ఉంది. ఇట్టి పూర్తి ఆస్తి రాజశ్రీ కోర్టు లో పెండింగ్ ఉంది కాబట్టి ఎవరైనా ఇట్టి ఆస్తిని అమ్మినను, కొన్నను లేదా మరే ఇతర మార్పులు, చేర్పులు చేసినను చట్టరీత్యా చెల్లనేరదు. అలా చేసిన యెడల మేము తీసుకోను సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరని లీగల్ ప్రకటన ద్వారా తెలుపడమైనది.

ఇట్లు: షేక్ ఇమామ్ బాష,
అడ్వకేట్, మైదుకూరు

18 నుంచి మల్లెం కొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

గోపవరం : శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజులపాటు మల్లెం కొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు బద్వేలు దేవాదాయశాఖ ఈఓ శివయ్య తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దేవాదాయశాఖ, పాలకమండలి సంయుక్తంగా బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లను చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం కొండపైన, కొండ దిగువన అన్ని వసతులు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. 18న కల్యాణ మహోత్సవం చేయనున్నట్లు తెలిపారు.